రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## భ్రమరాంబామల్లీశ్వరుని బ్రహ్మోత్సవాలు

**నందిగామ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని నందిగామ మండలం లోని చేగూరు ఉమ్మడి గ్రామ వెంకమ్మగూడలో వెలసిన చారిత్రాత్మక పురాతన శ్రీభ్రమరాంబామల్లీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15వతేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ పూజారి వీరేశంస్వామి, దేవాలయ కమిటీ చైర్మన్ ధరూర్ సతీష్‌పటేల్ శనివారం తెలిపారు. ఈనెల 15వ తేదీన బహుళ త్రయోదశి నుండి ప్రారంభమై 19వ తేదీ సాయంత్రం ముగింపు వరకు జరిగే వేడుకలకు భక్తులు అత్యధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. స్వామివారి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్, చెవులపల్లి ప్రతాప్ రెడ్డి, బక్కని నర్సింలు, బి.కిష్టయ్య, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాం సుందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్ పలువురు రాజకీయ ప్రముఖు లు, ఆలయ అభివృద్ధి దాతలు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారు లు తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## క్రమ-శిక్షణ ఉల్లంఘించిన కాంగ్రెస్ కార్యకర్తపై వేటు

**కేశంపేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై పార్టీ కఠిన చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ కొనాయపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు చొప్పరి జంగయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కేశంపేట మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన హరీశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ గత కొద్దిరోజులుగా పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆయన తీరు వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుందని పంచాయతీ ఎన్నికల్లో, ఎమ్మెల్యే ఎలక్షన్లలో కూడా బిఆర్ఎస్ పార్టీకి సపోర్ట్ చేస్తూ కాంగ్రెస్ పార్టీకి, పార్టీ సిద్ధాంతాలకు అన్యాయం చేస్తున్నాడు కాబట్టి ఈ విషయమై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు కూడా వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప దృష్టికి తీసుకువెళ్లామని ఆయన అన్నారు. హరీశ్వర్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నామని నేటి నుండి హరీశ్వర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదంటూ గ్రామకమిటీ అధ్యక్షుడు చొప్పరి జంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఉపసర్పంచి నరసింహారెడ్డి, వార్డుసభ్యులు గ్యార సురేశ్, పాల్గొన్నారు.

## ఘనంగా భ్రమరాంబామల్లికార్జునస్వామి కళ్యాణం



ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న నర్సింహ్మారెడ్డి, ఓంకార్‌రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయ-మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అర్చకుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవమూర్తులకు కళ్యాణం జరిపించారు. ఆలయ కమిటీ కొంతం నర్సింహ్మారెడ్డి, కొంతం ఓంకార్‌రెడ్డిలు మంగళవాయిద్యాలతో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చారు. కళ్యాణం లో పాల్గొన్న దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై భ్రమరాంబ, మల్లికార్జునస్వామి కళ్యాణాన్ని నిర్వహించగా భక్తులు విచ్చేసి భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈసందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు అభిషేకం అనంతరం మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చన, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అర్చన, రాత్రి 11:45 గంటలకు లింగోద్భవకాల అభిషేకం జరుగుతుందని తెలిపారు. ఆలయకమిటీ చైర్మన్ కొంతం రాంరెడ్డి, కొంతం అంజిరెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ కుమార్తెకు శుభాకాంక్షలు



అనన్యను మర్యాద పూర్వకంగా కలిసిన శుభాకాంక్షలు తెలియజేసిన సర్పంచి బైండ్ల అమృతమ్మ నారాయణ, సీనియర్ నాయకులు మాజీ సర్పంచి భీమయ్య

**కోట్‌పల్లి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ సర్పంచి బైండ్ల అమృతమ్మ నారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచి భీమయ్యలు వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భారీ మోజార్టీతో గెలుపొందిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ కుమార్తె అనన్యను వికారాబాద్‌లోని ఆమె నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారివెంట కారోబార్ అశోక్ ఉన్నారు,

## గెలుపొందిన వార్డు సభ్యులతో క్యాంపు

**-మూడు మున్సిపాల్టీల బిఆర్ఎస్ సభ్యులతో క్యాంపు కొనసాగింపు**



బిఆర్ఎస్ సభ్యులతో క్యాంపులో ఉన్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో గెలుపొందిన బిఆర్ఎస్ వార్డుల సభ్యులు 14మంది, అలియాబాద్ మున్సిపాల్టీలో గెలుపొందిన బిఆర్ఎస్ 7మంది వార్డుల సభ్యులు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి క్యాంపులోనే ఉన్నారు. శనివారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి బిఆర్ఎస్ నుంచి చైర్మన్ పదవులు దక్కించుకోవటానికి బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన మూడుచింతలపల్లి మున్సిపాల్టీవారిని, అదేవిధంగా అలియాబాద్ మున్సిపాల్టీలో బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన వారిని ఒకే క్యాంపును ఏర్పాటు చేసి రహస్య ప్రాంతంలో ఉంచినట్లు పార్టీ వర్గాల నుంచి సమాచారం. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయా మున్సిపాల్టీల చైర్మన్ పదవుల కోసం ఏర్పాటు చేసిన క్యాంపులో వారితో గ్రూపు ఫోటోలు దిగటంతో వారు ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలోనే ఉన్నట్లు స్పష్టం అయింది. అదేవిధంగా ఎల్లంపేట్ మున్సిపాల్టీ నుంచి గెలుపొందిన 12మంది బిఆర్ఎస్ వార్డు సభ్యులు ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలోనే అదే క్యాంపులో ఉన్నారు. ఏది ఏమైనా ఆయా మున్సిపాల్టీల చైర్మన్ పదవిని దక్కించుకోవటానికి కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తుంది.

## ఉద్యమకారుడికి దక్కిన గౌరవం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుడికి ప్రజలు పట్టం కట్టారు. 15 వార్డులో జనరల్ మహిళ స్థానానికి పోటీపడిన రఘు సతీమణి ఎంగలి భాగ్యలక్ష్మిరఘు విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షతో 2001లో అప్పటి టిఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన దశాబ్దాల కాలంగా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి ఉద్యమకారుడుగా పేరు సంపాదించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎంగలి రఘు భార్య కౌన్సిలర్‌గా గెలవ టంతో ఉద్యమకారుడికి దక్కిన గౌరవంగా నాటి ఉద్యమకారులు, ప్రజలు అభివర్ణిస్తూ హర్షిస్తున్నారు.

## ప్రతిపక్షంలోనూ కారు జోరు..హ్యాట్రిక్ విజయం!

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ప్రస్తుత రాజకీయ సమీక రణాల్లో ప్రతిపక్షంలో ఉన్న కారుపార్టీ అభ్యర్థులు తమ పట్టు నిలుపుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లుగా ఆకుల యాదగిరి, నీలం శ్వేత వరుసగా మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ నమోదుచేశారు. గతంలో టిడిపి నుంచి రాజకీయ ప్రస్థా నం ప్రారంభించిన వీరిద్దరూ, ఆతర్వాత బిఆర్ఎస్‌లోచేరి వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. నిన్న వెలువడిన ఫలితాల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులుగా బరిలోకి దిగినప్పటికీ, ప్రజలు మరోసారి వీరికే పట్టం కట్టడం విశేషం. దీంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

**-కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు అభిషేకాలు, హోమాలు**

**-స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు**



కీసర యాగశాలలో హోమాలు చేస్తున్న వేద పండితులు

**కీసర, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వస్వామి సన్నిధిలో రుద్రస్వాహాకార హోమాలు వైభవంగా జరిగాయి. స్వామివారి ప్రధాన ఆలయానికి ప్రక్కన ఏర్పాటుచేసిన యాగశాలలో వేద పండితులు గణపతిశర్మ ఆధ్వర్యంలో రుద్రహోమం, వేద పారాయణం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బిల్వార్చన, ప్రదోషకాల పూజ, హారతి, మంత్రపుష్పం, స్తవం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఒకప్పుడు కీసరగుట్ట ప్రాంతంలో మునులు, ఋషులు హోమాలు జరిపినట్లు పురాణగాథలో ఉందని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆరురోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు మార్తి సత్యనారాయణమూర్తి, గణపతి శర్మలు తెలిపారు. లోక క్షేమం కోసం టిటిడి వేద పాఠశాల విద్యార్థులతో యాగశాలలో హోమాలు, వేద పారాయణం చేస్తున్నట్లు తెలిపారు.

**కీసరలో పోచమ్మ అంగడి...**

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతి ఏడాది మహాశివరాత్రికి ముందురోజు కీసరలోని పోచమ్మ ఆలయంలోని అమ్మవారికి నగరంలోని యాప్రాల్, అమ్ముగూడ, అల్వాల్ ప్రాంతాల నుంచి వచ్చే తమిళులు దర్శించుకుని కీసరగుట్ట జాతరకు ఎడ్లబండ్లు, వాహనాలలో బయలు దేరుతారు. అమ్మవారి ఆలయం వద్దే మేకలు, కోళ్లను కోసి, భోజనంచేసి బయలు దేరుతారు.

**బ్రహ్మోత్సవాల్లో నేటి పూజల వివరాలు...**

తెల్లవారుఝామున 4గంటల నుండి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, ఉదయం 6 గంటల నుండి సామూహిక అభిషేకాలు (కళ్యాణ మండపంలో), ఉదయం 9గంటలకు రుద్రస్వాహాకార హోమం, రాత్రి 8గంటలకు నందివాహన సేవ, రాత్రి 10గంటలకు భజనలు, అర్థరాత్రి 12 గంటల నుండి శ్రీ రామలింగేశ్వస్వామి వారికి సంతత ధారాభిషేకం (లింగోద్భవ కాలంలో) తదితర పూజలు నిర్వహించనున్నారు.

# మున్సిపల్ పీఠానికి ముందే హస్తం సలాం..

**-అంతర్గత విభేదాలతో కాంగ్రెస్ క్యాంపు ఖాళీ..?**

**-మ్యాజిక్ ఫిగర్ అందుకున్న బిఆర్ఎస్..**

**-గులాబీ గూటికి స్వతంత్ర అభ్యర్థి**

**-బిజెపి అభ్యర్థులు కూడా బిఆర్ఎస్‌కే..?**




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకోవాలని ఆశపడ్డ కాంగ్రెస్ పార్టీకి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటల్లోనే హస్తం పార్టీ రాజకీయంగా డీలా పడిపోయింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు ముందే ఆ పార్టీ క్షేత్రస్థాయిలో చేతులెత్తేసినట్లు కనిపిస్తోంది. గెలిచిన ఎనిమిదిమంది కౌన్సిలర్లను కాపాడుకునేందుకు కందుకూరు సమీపంలోని ఓరిసార్ట్ లో కాంగ్రెస్ పార్టీ క్యాంపు ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే, అక్కడ అంతా సవ్యంగా సాగలేదని తెలుస్తోంది. చైర్మన్ పదవిపై కన్నేసిన ఇద్దరు నేతల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగినట్లు సమాచారం. "గత ఎన్నికల్లో ఎమ్మెల్యే నా దగ్గర డబ్బులు తీసుకున్నారు.. కాబట్టి పదవి నాకే దక్కుతుంది" అంటూ ఒక నేత వాదించగా, దానికి ప్రతిగా మరో నేత తీవ్రంగా స్పందించారని, దీంతో రిసార్ట్‌లో ఉద్రిక్తత చోటుచేసుకున్నట్లు ఆపార్టీ నేత లు గుసగుసలాడుతున్నారు. ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం, సఖ్యత కుదరకపోవడంతో పార్టీ నేతలు చేసేదేమీ లేక రాత్రికి రాత్రే క్యాంపును ఎత్తేసినట్లు సమాచారం.

**బిఆర్ఎస్ చతురత.. 16కు చేరిన బలం...**

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోమాత్రం బిఆర్ఎస్ తన పట్టును నిరూపించుకుంది. 13మంది సొంత సభ్యుల బలం ఉన్నప్పటికీ, రాజకీయ చతురతతో స్వతంత్ర అభ్యర్థిని ఇప్పటికే తమగూటికి చేర్చుకోగా.. బిజపికి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు కూడా బిఆర్ఎస్‌కే మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. దీంతో బిఆర్ఎస్ బలం 16కు చేరుకోగా.. కాంగ్రెస్‌కు చెందిన మరో ఇద్దరు కౌన్సిలర్లు కూడా గులాబీ నేతలతో టచ్‌లో ఉన్నట్లు రాజకీయ వర్గాలు జోరుగా చర్చించుకుంటున్నాయి. మరోవైపు ఎక్స్ అఫీషియో ఓట్ల విషయంలోనూ కాంగ్రెస్‌కు చుక్కెదు రైంది. భువనగిరి ఎంపి తన ఓటు హక్కును జనగామకు మార్చుకోవడం, కేవలం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఓటు మాత్రమే అందుబాటులో ఉండటంతో కాంగ్రెస్ బలం 9కి మించడం లేదు. మ్యాజిక్ ఫిగర్‌కు ఆమడ దూరంలో ఉండటం, సొంత కౌన్సిలర్ల మధ్యే ఘర్షణలు చోటుచేసు కోవడంతో.. పోటీ నుంచి తప్పుకుని పరువు కాపాడుకోవడమే మేలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠంపై గులాబీ జెండా ఎగరడం దాదాపు ఖాయమైంది.

# మున్సిపాలిటీ చైర్మన్‌గిరీకి 'బిసి' నినాదం

**-మారుతున్న రాజకీయ సమీకరణాలు**

**-చేవెళ్ల చైర్మన్ పీఠం జనరల్**




చేవెళ్ల మున్సిపాలిటీ భవనం

**చేవెళ్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

చేవెళ్ల మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. మెజార్టీ స్థానాలు అధికార కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్నా, గెలిచిన అభ్యర్థులను క్యాంపుకు తరలించారు. చేవెళ్ల మున్సిపాలిటీ చైర్మన్ స్థానం జనరల్ కావడంతో బిసి నినాదం తెరపైకి వచ్చింది. చేవెళ్ల మున్సిపాలిటీ చైర్మన్ పీఠం లోకల్‌కు ఇవ్వాల్సి వస్తే స్థానికంగా మంచి పట్టున్న బిసి సామాజిక వర్గానికి చేందిన మాజీ జడ్‌పిటిసి మంగళి బాల్‌రాజ్ కోడలు మంగళి కళ్యాణికి ఇవ్వాలని వాదనలు వినిపిస్తున్నాయి. నాన్ లోకల్‌కు ఇవ్వాల్సి వస్తే కాంగ్రెస్ వాది కాంగ్రెస్ పార్టీకి గత 40 ఏళ్లుగా సేవలు చేసి పార్టీ మారని కడదుగట్టిన కాంగ్రెస్ వాది కందవాడ గ్రామానికి చెందిన సోలిపురం బల్వంత్‌రెడ్డి భార్య సుచరితకు ఇవ్వాలన్న వాదనలు కూడా విని పిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు తమకు మద్దకు తెలుపకుంటే ఇతర పార్టీల నుండి గెలుపొందిన బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి గెలుపొందిన వారి మద్దతుతో చైర్మన్‌ను చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. బిసిలకు చైర్మన్ పీఠం ఇవ్వాల్సి వస్తే చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 18వవార్డులో గెలిచిన మంగళి కళ్యాణీయాదగిరికి ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. నాన్‌లోకల్ జనరల్‌కు చైర్మన్ పీఠం ఇవ్వాల్సి వస్తే కందవాడ గ్రామంలోని 6వ వార్డులో విజయం సాధించిన సోలీపురం సుచరిత బల్వంత్ రెడ్డికి ఇవ్వాలన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇరువురు నేతలు రహస్య ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన అభ్యర్దులు మద్దతు తెలుపకుంటే ఇతర పార్టీలో గెలిచిన వారి మద్దతు తీసుకుని చైర్మన్ పీఠం దక్కిం చుకునేందుకు ఓనేత పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఎన్నికలకు ముందే చైర్మన్ పీఠం చేవెళ్ళకు చెందిన దేవర సమతవెంకట్‌రెడ్డిని అధిష్ఠానం ప్రకటించిన సంగతి తెలిసిందే. స్థానిక నేతలను సంప్రతించకుండా ఇష్టానుసారంగా చైర్మన్ పీఠం దేవర సమతవెంకట్‌రెడ్డికి కట్టబెట్టేందుకు మాట ఇవ్వ దంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల మున్సి పాలిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ క్యాంపులో లుకలుకలు మొదలవడం జరిగిందని విశ్వసనీయ సమాచారం. బిసిలకు చైర్మన్ పదవి కోసం ఇతర పార్టీల నుండి 7గురి మద్దతు తీసుకుని ఇద్దరు కాంగ్రెస్ పార్టీ బడా నేతలు చైర్మన్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ క్యాంపులో రెండు గ్రూపులుగా విడిపోయి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు తెలిసింది. చైర్మన్ పీఠం ఖాయమని ఇచ్చిన మాట నిలబడుతుందా? లేదా నాన్ లోకల్ నినాదమా? బిసి నినాదానికి చైర్మన్ పదవి వస్తుందా? వేచి చూడాల్సిందే.

## బిజెపికి షాక్..పట్టణ అధ్యక్షుడు రాజీనామా

**షాద్‌నగర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి నియోజకవర్గ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ బూతులు తిట్టిన హరిభూషణ్‌పటేల్ పార్టీకి రాజీనామా చేయడంతో ఆయన రాజీనామాలు జిల్లా అధ్యక్షుడు ఆమోదించారు. బిజెపి రాజకీయాల్లో సంచలంగా మారిన హరిభూషణ్ వ్యవహారం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మిగిలింది. బిజెపి షాద్‌నగర్ మున్సిపాలిటీ అధ్యక్షులు హరిభూషణ్ తన రాజీనామాపత్రాన్ని బిజెపి రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌కు అందించగా, దాన్ని ఆమోదించినట్లు తెలియజేసారు. బిజెపి నాయకత్వం హరిభూషణ్ రాజీనామాతో డైలమాలో పడింది.

## ఇంచి జాగా కూడా కదలొద్దు

**-సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**

**చేవెళ్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

పేదల జాగాకోసం పోరుకు సిద్ధంకావాలని, ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల పట్టణంలోని 75వ సర్వే నంబర్ లోగల భూపోరాట కేంద్రంలో ఈరోజు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నియోజకవర్గం ఇన్చార్జికి కె.రామస్వామి అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు పార్టీ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సభలో పానుగంటి పర్వతాలు, ఎం.ప్రభులింగం వడ్ల సత్యనారాయణ, ఎం.సత్తి రెడ్డి, మంజుల జె.అంజయ్య, సుధాకర్‌గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో తేలిపోతున్న అభ్యర్థులు..

**షాద్‌నగర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

ఎక్కడ ఏ ఆందోళన జరిగినా గళం విప్పుతామంటారు.. ప్రభుత్వాలను తిట్టడంలో ముందుంటారు.. కానీ ఎన్నికల సమయం వచ్చేసరికి మాత్రం తేలిపోతుంటారు. దశాబ్దాలుగా అలంకారప్రాయంగా ఉన్న కొన్ని పార్టీల పరిస్థితి ఇది. తాజాగా మున్సిపాలిటీ ఎన్నికల్లోను ఈ పార్టీల బలహీనతలు మరోసారి బయటపడ్డాయి. ఒకసారి వివరాల్లోకి వెళితే..

**మేమున్నామనీ..**

ఎప్పుడు ఎన్నికలు జరిగినా తాము బరిలో ఉన్నామని నిరూపించుకునేందుకు ముందుకు వచ్చే పార్టీలు కొన్ని ఉన్నాయి. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామంటూ వీళ్ళు ప్రకటిస్తున్నప్పటికీ, ఆ పోరాటాలు ఎక్కడా కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం హడావిడిగా వచ్చి బరిలో నిలబడి తమ బలం చాటుకుని ప్రయత్నం చేస్తుంటారు. కానీ ప్రయత్నం చేసిన ప్రతిసారి తేలిపోవడం వీళ్ళ వంతు అవుతుంది. దీనికి కారణం నిరంతరం ప్రజాక్షేత్రంలో లేకపోవడమే. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి లాంటి పార్టీలు ఎప్పుడూ ప్రజల్లో ఉండటంతో ప్రజల్లో ఆపార్టీలకు మాత్రమే గుర్తింపు ఉంది. ఇప్పటికైనా మార్పు రావాలంటే ఈ పార్టీలు జనంలోకి రావాల్సిందే..

తాజా మున్సిపాలిటీ ఎన్నికలనే తీసుకుంటే పట్టణంలోని 13వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వానాబేగం 152 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించింది. ఇక్కడ సిపిఎం తరపున పోటీ చేసిన జరీనాబేగంకు కేవలం 10 ఓట్లు మాత్రమే వచ్చాయి. 17వ వార్డులో నాజియా బేగంతో బిఎస్పీ అభ్యర్థిగా పోటీపడిన సుగుణ కేవలం మూడు ఓట్లకు పరిమితమైంది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీలో నిలిచిన రాజ్‌కుమార్ 100 ఓట్లకు పైగా సాధించినప్పటికీ అది అతని వ్యక్తిగత ఇమేజ్ తప్ప.. ఆ ఓట్లతో ఆ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. ఎంత విచిత్రం అంటే కొన్నిచోట్ల స్వతంత్ర అభ్యర్థులు సాధించిన ఓట్లు కూడా ఈ పార్టీలకు రావడం లేదు. భవిష్యత్తులో ఈ పరిస్థితి పోవాలంటే ఈ పార్టీలు జనంలోకి రావాలి.. జనాలను ఆకట్టుకోవాలి.. లేదంటే ఎప్పటికీ ఇంతే..

## చైర్మన్‌పదవిపై ఎవరికి వారిదే ధీమా

**-అభ్యర్థుల్లోనూ, పార్టీనాయకుల్లోనూ టెన్షన్..టెన్షన్**

**-క్యాంపు రాజకీయాలతో ఉత్కంఠత**

**-కీలకంగా మారుతున్న ఇండిపెండెంట్, బిజెపి సీట్లు**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

అలియాబాద్ మున్సిపాల్టీ ఎన్నికల్లో చైర్మన్(జనరల్-మహిళ) స్థానాన్ని దక్కించుకోవటానికి ఇటు కాంగ్రెస్ పార్టీకి, అటు బిఆర్ఎస్ పార్టీకి కూడా మెజార్టీ దక్కకపోవటంతో ఇంతకీ చైర్మన్‌పదవి ఎవరికి దక్కుతుందనే విషయంపై ఉత్కంఠత కొనసాగుతుంది. ఆయా పార్టీలు ప్రధానంగా గెలుపొందిన ఇండిపెండెంట్ సభ్యునిపై, బిజెపినుంచి గెలిచిన ముగ్గురు సభ్యులపైనే ఆశలు పెట్టుకున్నాయి. ఈనెల16న సోమవారం అలియా బాద్ మున్సిపల్‌చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించ నున్నారు. అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులు ఉండగా, చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకోవటానికి మెజార్టీ 11మంది సభ్యులు ఓటింగ్ చేస్తేనే ఆ పదవులకు గెలిచే పరిస్థితి ఉంది. అయితే గెలుపొందిన స్థానాల్లో కాంగ్రెస్-8, బిఆర్ఎస్-7, బిజెపి-3, బిఎస్‌పి-1, ఇండిపెండెంట్-1 స్థానాల్లో పార్టీల వారీగా గెలుపొందారు. అయితే చైర్మన్ పదవిని దక్కించుకోవటానికి మెజార్టీ ఏ పార్టీకి దక్కకపోవటంతో రాజకీయ నాయకుల్లోనూ, అభ్యర్థుల్లోనూ ఉత్కంఠభరిత పరిస్థితి ఏర్ప డింది. కాంగ్రెస్‌నుంచి చైర్మన్ అభ్యర్థిగా కంటం శిరీషకృష్ణారెడ్డి ఉండగ, బిఆర్ఎస్ నుంచి చైర్మన్ అభ్యర్థిగా చీదు వనజశ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ వారు 8మంది ఉండగ, వీరికి బిఎస్‌పి నుంచి గెలుపొందిన గూదె వెంకటేశ మద్దతుగా ఉంటూ వారి క్యాంపులోనే ఉన్నట్లు సమాచారం. వీరికి మరో రెండు స్థానాలు అవసరం ఉంది. అయితే ఇండిపెండెంట్ సభ్యులు గాదె వెంకటేశ ముందుగా కాంగ్రెస్ వైపున మొగ్గు చూపినప్పటికీ ఆ తరువాత క్యాంపునకు వెళ్లకుండ ఇంటి వద్దనే ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ వారి వెంట వెళ్లకుండ ఇండిపెండెంట్ సభ్యుడు గాదె వెంకటేశ ఇంటివద్దనే ఉండి ఆయాపార్టీల వారితో మద్దతు ఇచ్చే విషయంపై చర్చిస్తున్నట్లు, మద్దతు విషయంపై ఇప్పటికీని స్పష్టత రాలేదని తెలుస్తుంది. ఇదీ ఇలా ఉండగా బిఆర్ఎస్ పార్టీలో 7మంది సభ్యులు ఉండగా మరో 4స్థానాల సభ్యులు మద్దతు కావలసి ఉంది. అయితే ఇండిపెండెంట్ సభ్యునితో పాటు బిజెపి ముగ్గురు సభ్యులతోనూ ఆయా పార్టీల నాయకులతో మద్దతు కోసం చర్చిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బిజెపి నుంచి గెలిచిన ముగ్గురు కూడ ప్రత్యేకంగా రహస్యప్రాంతానికివెళ్లి క్యాంపులో ఉన్నట్లు తెలిసింది. వీరు బిఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారా..లేక కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తారా అనేది తేలాల్సి ఉన్నట్లు పార్టీవర్గాల నుంచి సమాచారం. అయితే బిజెపి కీలకం అవుతుండటంతో చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు కూడా ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. బిజెపి అధిష్ఠానం మాత్రం ఏపార్టీకి మద్దతు ఇవ్వ టం లేదని తెలియజేసినట్లు సమాచారం. చైర్మన్ పదవి కోసం కీలకంగ మారి ఇక అందరి దృష్టి ఇండిపెండెంట్ సభ్యునిపై, బిజెపి సభ్యులపై పడిందని చెప్పవచ్చు. నాయకులు మాత్రం మద్దతుకు ఇండిపెండెంట్ సభ్యునితో, సంబంధిత నాయకులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.

## ఉత్సవాలకు సిద్ధమైన శివాలయాలు

**యాచారం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని యాచారం మండలపరిధి లోని వివిధ గ్రామాలలో ఉన్న ఆలయాలు ముస్తాబయ్యాయి. ముఖ్యంగా మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో వైభవంగా నందీశ్వరాలయం, ఓంకారేశ్వరాలయం, సిద్దేశ్వరాలయాలను నిర్వాహకులు వైభవంగా అలం కరణలతో సిద్ధంచేశారు. ఆలయాలకు రంగులువేసి దీపాలంకరణతో తోరణాలతో తీర్చిదిద్దారు. యాచారం సిఐ నందీశ్వర్‌రెడ్డి ఆలయాలను పరిశీలించి భక్తులకు ఇబ్బందులు కాకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచన చేశారు.

## సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తాం



సమ్మెలో పాల్గొన్న రిగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని గ్రేటర్ హైదరాబాద్ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ వారు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రిగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుండి నిరవధికంగా సమ్మె జరుగుతుందని వారు స్పష్టం చేశారు. బోర్లు వేస్తున్న సమయంలో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఎంతో మంది నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా స్పేర్ పార్ట్స్ రేట్లు గాని, పైపులు, బిట్స్, హామర్స్, డీజిల్, ఆయిల్, లేబర్ ధరలు పెరగడం వల్ల నిరవధిక సమ్మె జరుగుతున్నట్లు తెలియజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రిగ్స్ మొత్తము ఆరున్నర నాలుగున్నర రోబోలను మొత్తం నిలిపివేసినట్లు తెలియజేశారు. ఈ విషయాన్ని వినియోగదారులు, కంపెనీవారు గ్రహించి తమకు సహకారం అందించాలని మనవి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ముసుకు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి నర్సిరెడ్డి, కోశాధికారి మోహన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సభ్యులు డి నరసింహ ముదిరాజ్, విష్ణువర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, రాము, శ్రీనివాసరావు, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, సిద్ధిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

## పోగొట్టుకున్న ఫోన్లను అప్పగించిన పోలీసులు



మొబైల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఏసీపీ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ గోపిలు

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ప్రయాణం, మార్కెట్, షాపింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సంబంధిత ఫోన్ సిమ్, ఐఎంఈ నెంబర్లను పోలీసులకు తెలియజేయాలని చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ.సుధాకర్ కోరారు. ఆ నెంబర్లను సీఈఐఆర్ ( సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ ) పోర్టల్ నమోదు చేసి రికవరీ చేస్తామన్నారు. చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 32 మొబైల్ ఫోన్లను ఇన్‌స్పెక్టర్ గోపి, డీఐ రామస్వామిలతో కలిసి శనివారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ఫోన్లలో ఉన్న గుగూల్ పే, ఫోన్ పేలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్ పోయిన వెంటనే సంబంధిత సర్వీసు ప్రొవైడర్లకు ఫోన్ చేసి సిమ్‌ను బ్లాక్ చేయించుకోవాలని సూచించారు. పోయిన ఫోన్ల రికవరీ కోసం ప్రతి పోలీసుస్టేషన్లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 32 ఫోన్లను రికవరీ చేసిన క్రైమ్ టీమ్‌ను అభినందించారు. క్రైమ్ టీమ్‌కు రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించారు. కాగ తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చెట్ల కొమ్మలను తొలగించిన జిహెచ్ఎంసి సిబ్బంది



ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

**బేగంపేట ఫిబ్రవరి 14,ప్రభాతవార్త**

బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో శనివారం విద్యుత్ తీగలకు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ సిబ్బంది కొట్టివేసారు. సనత్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జి కోట నీలిమ ఆదేశాల మేరకు శనివారం ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ రోడ్డులో అంతరాయంగా ఉన్న కొమ్మలను కొట్టివేసారు. హైమాస్ట్ లైట్లకు కూడా చెట్లకొమ్మలు అంతరాయంగా మారడంతో బస్తీకి చెందిన వారు ఈ విషయాన్ని కోట నీలిమ దృష్టికి తీసికెళ్లడంతో కొమ్మలు కొట్టివేసారు. ఈ కార్యక్రమంలో మునీర్‌ఖాన్, నసీరుద్దీన్ (అడ్డూ) ఉన్నారు.

## నీతి,నిజాయితీ,స్వయం కృషితో ఎదిగిన దామోదరం
### -మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



దామోదరం సంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ.

**బేగంపేట ఫిబ్రవరి 14,ప్రభాతవార్త**

నీతి,నిజాయితీ,స్వయం కృషితో అత్యున్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,కార్మిక పక్షపాతి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో ఆయన చిత్ర పటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించి స్వయం కృషితో ప్రజాసేవా తత్పరతతో ఆయన ఎంతో ఎత్తుకు ఎదిగారని కొనియాడారు. చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి సామాజిక న్యాయం ,భూసంస్కరణలు ,వెనుక బడిన వర్గాల అభివృద్ధికి విశేష కృషి చేసారని ,కేంద్ర కార్మిక శాఖామంత్రిగా కార్మికుల అభ్యున్నతికి నిరంతరం ఆయన కృషి చేసారని అన్నారు. దామోదరం సంజీవయ్య ఆశయాలు,విలువలు ఎల్లప్పుడు మనకు మార్గదర్శకంగా నిలవాలని కోరుకుంటున్నానని అన్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు. చిత్రంలో పలువురు కాంగ్రెస్ నేతలు

## ప్రపంచంతో పోటీపడే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి
### -ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త**

మనచుట్టూ ఉన్నవారితో కాకుండా ప్రపంచంతో పోటీపడే విజ్ఞానాన్ని సంపాదించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బి. బాలకిష్టారెడ్డి అన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్‌రావు అధ్యక్షతన శనివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్లో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో జరిగిన హెచ్ఎర్ కాంక్లైవ్ 2028 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనచుట్టూ ఉన్నవారితో కాకుండా ప్రపంచంతో పోటీపడే విజ్ఞానాన్ని సంపాదించాలని, అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశంగా కాకుండా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని, 2047 సంవత్సరం వరకు 30 ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించాలని ప్రధాని మోదీ చెప్పారని, ఆ దిశగా నేటి యువత కృషి చేయాలని సూచించారు. మనల్ని టెక్నాలజీ కంట్రోల్ చేయకుండా మనమే టెక్నాలజీని కంట్రోల్ చేసే స్థాయిలో ఉండాలని సూచించారు. ప్రతిభావంతులకు అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అవంతి కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ యం.ప్రియాంక, టెక్ మహేంద్ర ఇండియా గ్రోత్ హెడ్ చల్లా వివేకానంద, ఇన్ఫోసిస్ టెక్నికల్ స్పీకర్ డాక్టర్ సర్వేపల్లి కళ్యాణ్, హెచ్డిఎఫిసి రీజినల్ మేనేజర్ రామ్ కిషోర్, విప్రో టాలెంట్ ఆక్విజేషన్ అసోసియేట్ డైరెక్టర్ సేపురి నరేష్ అంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అప్పారావు, హెచ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, వైస్ ప్రెసిడెంట్ ఎంవిఎస్ఎస్. నందేష్, డాక్టర్ రాకేష్, హెచ్ఎర్ అలీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు



అవంతి విద్యాసంస్థ నిర్వహించిన హెచ్ఆర్ కాంక్లైవ్ సదస్సు ప్రారంభిస్తున్న సంస్థ చైర్మన్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తదితరులు

## అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన సనాతన హిందూ ధర్మ సేన ప్రతినిధులు

**నిజాంపేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

సనాతన ధర్మ హిందూ పరిరక్షణలో భాగంగా హిందూ కళాక్షేత్రం, గ్రేవి యార్డ్, ధార్మిక కార్యక్రమాలకు కేటాయించిన స్థలంలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని అక్రమ కట్టడాలు నిర్మించే క్రమంలో భాగంగానే అక్కడ కావాలని కొంతమంది చేత చెత్త డంపును స్టోరేజ్ చేస్తున్నారని శనివారం స్థానిక ఎమ్మార్వోని కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకోవడం జరిగిందని ఆ స్థల పరిరక్షణలో భాగంగా సనాతన హిందూ ధర్మ పరిరక్షణ ప్రతినిధుల బృందం ఆ స్థలంలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా సనాతన హిందూ పరిరక్షణ సమితి బృంద సభ్యుడు బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ దాదాపు 2022 నుండి హిందువుల తరఫున పోరాడుతూ పలు మార్లు స్థానిక ఎమ్మార్వోకి జిల్లా కలెక్టర్‌కి వివిధ ప్రతినిధులకు పలుమార్లు వివిధ వినతి పత్రాలు సమర్పించగా సర్వేనెంబర్ 186లో 2025లో హిందువుల కోసం 1.5 ఎకరాల స్థలం కేటాయించి స్థానిక ఎమ్మార్వో సూచనలు మేరకు ఆర్ఐ సర్వేయర్ హద్దులను చూపించడం జరిగిందన్నారు. కానీ తాము పట్టు వదలకుండా 2023లో ఆర్డీవో పంచనామా ప్రకారం న్యాయబద్ధంగా హిందువులకు రావలసిన 3.20 ఎకరాలు కేటాయించాలని పలు మార్లు స్థానిక ఎమ్మార్వోకి కలెక్టర్‌ని కలవడం జరిగిందన్నారు. నూతనంగా వచ్చిన బాచుపల్లి ఎమ్మార్వో వాణి రెడ్డి ఆదేశాల మేరకు 186లో రీ సర్వే చేయడం ద్వారా హిందువులకు కేటాయించిన ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని రెండు ఎకరాలుగా మారుస్తూ ఉత్తర్వులు జారి చేయడం జరిగిందని, తమ యొక్క అభ్యర్థన మన్నించి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడాన్ని జిహెచ్ఎంసి నిజాంపేట సర్కిల్ హిందూ ప్రజల తరఫున జిల్లా కలెక్టర్‌కి, ముఖ్యంగా స్థానిక ఎమ్మార్వో వాణి రెడ్డికి, సర్వేయర్‌కి ఆర్ఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ ప్రయాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మాకు మద్దతు తెలియజేసి వివిధ సహాయ సహకారాలు అందించిన అందిస్తున్న అన్ని పార్టీలలోని ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ హిందూ కల్చర్ ఎలా అసోసియేషన్ సభ్యులైన బిక్షపతి యాదవ్ నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, సచిన్, నారాయణమూర్తి, శివ, సతీష్ కృష్ణ, సాయి కృష్ణారెడ్డి, అశోక్ నాయక్, నరేష్, భూపాల్ రెడ్డి, వేణు, కిషన్, విష్ణు, ఇతర హిందూ ప్రతినిధులు పాల్గొన్నారు



## నేత్రపర్వంగా శ్రీసంగమేశ్వరస్వామివారి మహాశివరాత్రి సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

**నాంపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లోవున్న అతిపురాతన శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామివార్ల దేవాలయంలో శనివారం ఉదయం 8.30ల నుండి యాగశాల ప్రవేశం, సోమకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమములు, ధ్వజాది హోమం, ధ్వజారోహణంలతో శ్రీ సంగమేశ్వరస్వామి వారి మహాశివరాత్రి, సప్తదశ వార్షిక బ్రహోత్సవాలు నేత్రపర్వంగా ఆరంభమై రాత్రి 7 నుండి భేరిపూజ, భేరి తాండవం, నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి, బలిహరణం, నివేదనలు శాస్త్రోక్తంగా జరిగాయి. ముందుగా శుక్రవారం సాయంత్రం 5.30గంటల నుండి గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, మృత్యంగ్రహణం, ఆంకురారోపణ, అఖండ దీపారాధాన, వాస్తుపూజ, వాస్తు హోమం, ధ్వజపటాధివాసము కన్నులపండువ చేశాయి. ఈ నెల 16 వరకు ఆలయ సంప్రదాయానుసారం జరుగుతున్న ఈ ఉత్సవాల్లో నిత్యహోమం, మహాన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార రుద్రాభిషేకాధి ప్రత్యేక పూజలతోపాటు ఆదివారం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, 7.30 నుండి రాత్రి 9గంటల వరకు ఏకవార రుద్రాభిషేకములు, అర్చనలు, ఉదయం 9లకు రుద్రహోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, నివేదన, రాత్రి 7లకు నిత్యహోమం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, రాద్రి 8. 30లకు శివకళ్యాణ మహోత్సవం, రాత్రి 11గంటల నుండి లింగోద్భవకాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, అనంతరం రథోత్సవము అర్చకస్వాముల వేదమంత్రోచ్ఛారణలతో భక్తజన సందోహ హరహర మహాదేవ... శంభోశంకర శివనామస్మరణతో జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ తదితర అర్చకులు తెలిపారు.



ధ్వజారోహణం, సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలతో ఆరంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు

## రంజాన్ మాసంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు : డిఈ శ్రీధర్

**చార్మినార్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** రంజాన్ మాసంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకున్నామని టిజిఎస్పిడిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్ అన్నారు. ప్రజలు విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తే క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. మక్కామసీదు ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమత్తుల పనులను ఆయన చార్మినార్ ఏడిఈ సయ్యద్ మక్సూద్, చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్,హుస్సేనీఆలం ఏఈ రాములతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చార్మినార్ డివిజనల్ ఇంజనీరు ఎం.శ్రీధర్ మాట్లాడుతూ కొద్ది రోజులలో రంజాన్ మాసం ప్రారంభం కానున్నదని,ప్రజలకు రంజాన్‌లో మాసంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండ ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు చేయటం జరిగిందని తెలిపారు. చారిత్రక మక్కామసీదువద్ద నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పని చేస్తున్నాయని, ఈ నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు అదనంగా 315కెవి సామర్థ్యం గల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు. అదే విధంగా లోడ్ డివైడ్ కోసం ఎలెట్ సర్క్యూట్ నెల కొల్పామని, మక్కామసీదుతో పాటు పాత నగరంలోని అన్ని మసీదులు వద్ద విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేశామని డిఈ శ్రీధర్ వెల్లడించారు. మక్కామసీదు వద్ద రంజాన్ మాసంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండ చార్మినార్ ఎడిఈ సయ్యద్ మక్సూద్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది ఉంటారని ఆయన తెలిపారు. అదే విధంగా కార్పొరేటర్ సంస్థ 15 మంది తాత్కాలిక సిబ్బందిని పంపించిందని ,వీరితో పాటు పాతబస్తీలోని ఎఫ్ఓసి సిబ్బంది కూడ అందుబాటులో ఉంటారని ఎటువంటి విద్యుత్ సమస్యలు కలగకుండ అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో చార్మినార్ ఏడిఈ సయ్యద్ మక్సూద్, చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్, హుస్సేనీఆలం ఏఈ రాములువిద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మక్కామసీదు వద్ద విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పనులను పరిశీలిస్తున్న చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్

## ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దిన ఘనత పవన్ వినయ్ కుమార్‌దే



తాజా మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 14 ( ప్రభాతవార్త ) :**

గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ గా గత ఐదేళ్లుగా అహర్నిశలు శ్రమిస్తూ, డివిజన్‌ను అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలిపిన పావని వినయ్ కుమార్ తమ పదవీ కాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం అభినందన సత్కార కార్యక్రమం భారతీయ జనతా యువమోర్చ, బీజేపీ, మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తో పాటు తాజా మాజీ కార్పొరేటర్ లను సత్కరించారు. డివిజన్ ప్రజల సంక్షేమం కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం పావని చేసిన కృషి చిరస్మరణీయమని, వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పుల్వామా దాడిని ఖండిస్తూ రక్తదాన శిబిరం...



**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

పాక్ ఉగ్రమూకల దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులైన బ్లాక్ డే సందర్భంగా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ వీరులను స్మరించుకుంటూ యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఎ.ఎస్ రాజు నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తప్పనిసరిగా రక్తదానం చేయాలని, తెలియచేసారు. ఈ కార్యక్రమంలో యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ గవ్వల భారత్ కుమార్, హైదరాబాద్ కన్వీనర్ రుద్ర అభిరామ్ గౌడ్, కో కన్వీనర్ శివ గౌడ్, ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించగా నాయకులు, సంజీవ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, దొడ్ల రామ కృష్ణ గౌడ్, శివరాజు గౌడ్, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో మానసికబలం భవిష్యత్తుకు సోపానం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**రవీంద్రభారతి, ఫిబ్రబరి 14 ప్రభాతవార్త :** మానవజీవితమే యాంత్రికంగా మారిన నేటి అధునాతన సాంకేతికయుగంలో ఎదురవుతున్న ఎన్నో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి విద్యార్థుల్లో మానసికబలం ఎంతో అవసరమని, అదే వారి భవిష్యత్తుకు సోపానమని కేంద్ర గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రముఖ విద్యాసంస్థ స్మార్ట్‌జీనియస్ శనివారం రవీంద్రభారతి ప్రధానమందిరంలో నిర్వహించిన గ్లోబల్ లెవల్ కాంపిటీషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. స్మార్ట్‌జీనియస్ ప్రపంచవ్యాప్తంగా 12వేల యువమేధావులైన విద్యార్థులు ఒకేవేదికపై తమ ప్రతిభను ప్రదర్శించడానికి వేదికను అందించి పోటీలు నిర్వహించడం శ్లాఘనీయమన్నారు. ఈ పోటీలు విద్యార్థుల్లో గణిత సామర్థ్యం, నైపుణ్యాన్ని వెలికితీయడమే కాకుండా వారిలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించి అద్భుతమైన టెక్నాలజీ, అంతర్జాతీయస్థాయి ఎంటర్‌ప్రైజెస్ స్థాపించి భారతదేశ గౌరవాన్ని ఫరిడవిల్లింపజేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం దేశాభివృద్ధిలో సైన్స్, టెక్నాలజీ, డేటా, ఇన్నోవేషన్, మ్యాథమెటికల్ థింకింగ్ కీలకపాత్ర పోషిస్తున్నాయని, మానవ మనుగడకు పునాదిలా మారాయన్నారు. ప్రాచీనకాలం నుండి భారతదేశం గణితశాస్త్రంలో ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించిందని ఆయా మేధావులను ఉటంకిస్తూ గుర్తుచేశారు. ఈ సదస్సు ద్వారా కృత్రిమ మేధస్సు విప్లవంలో విద్యా, స్టెమ్ రంగాలకు ప్రాధాన్యతపై మేధావు చర్చిస్తారన్నారు. 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో యువతే సారధులు... ఆత్మనిర్భరత, మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతికత, సుస్థిరత, సుపరిపాలన వంటి స్తంభాలపై వికసిత్ భారత నిర్మాణం ఆధారపడుతుందని, యువమేధావులు వికసిత భారత్ రథానికి సారథులవ్వాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. చివరిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒరాకిల్ ఇండియా సీనియర్ డైరెక్టర్ ఎం.రాజ్‌మోహన్, స్మార్ట్‌జీనియస్ వ్యవస్థాపక ఛైర్మన్ రాజలక్ష్మి రాజ్‌మోహన్ తదితర ప్రముఖులతో కలిసి విజేతలైన విదార్థులు అబాకస్, వేదగణితాలలో 1500 బహుమతులు, చేతివ్రాతలో 200మంది ఛాంపియన్లకు మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం పేరిట ఛాంపియన్లకు నగదు బహుమతులు అందజేసి శుభాభినందనలు తెలిపారు.



బహుమతి గ్రహీతలైన విద్యార్థులతో కిషన్‌రెడ్డి, రాజ్‌మోహన్, రాజలక్ష్మి తదితర అతిథులు

## మున్సిపల్ ఎన్నికల్లో బిసి అభ్యర్థుల ఘన విజయం : గుజ్జ సత్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త**

రిజర్వేషన్లలో మోసం చేసినా మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల ఘన విజయం సాధించారని బిసి సంక్షేమ సంఘం పేర్కొంది. శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీసీ రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ పార్టీల వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఈ సమావేశానికి సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షత వహించి మాట్లాడుతూ 'బీసీ రిజర్వేషన్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొని, అమలు విషయంలో మాత్రం అన్ని పార్టీలు బీసీలను మోసం చేశాయి. ఎన్నో హామీలు ఇచ్చినా, అసలు బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు" అని మండిపడ్డారు. తాజా మున్సిపల్ ఎన్నికల్లో 116 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లలో మొత్తం 2900 కు పైగా ఎన్నికలు జరిగిన వార్డుల్లో మెజారిటీ బీసీ అభ్యర్థులు విజయాలు సాధించారని తెలిపారు. ఇందులో ఎక్కువ భాగం జనరల్ సీట్లలోనే వచ్చాయన్నారు. ఈ ఎన్నికల్లో బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూసే రోజులు పోయాయి. ఇకపై మా హక్కులను విస్మరిస్తే ప్రజాస్వామ్య మార్గంలో మరిన్ని తీర్పులు ఇస్తాం" అని గుజ్జ సత్యం హెచ్చరించారు. బీసీ జేఏసీ కన్వీనర్ రాజునేత మాట్లాడుతూ "బీసీల ఓటు శక్తి ఎంత ప్రభావవంతమో ఈ ఎన్నికలు రుజువు చేశాయి. ఇకపై బీసీల హక్కులను విస్మరించే రాజకీయాలకు బీసీ సమాజం గట్టి సమాధానం ఇస్తుంది" అని హెచ్చరించారు. ఓబీసీ జాతీయ అధ్యక్షులు ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ ..ఈరోజు వచ్చిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 53పైగా బీసీ అభ్యర్థులు విజయం సాధించడం సాధారణ విషయం కాదు. ఇది బీసీ సమాజం ఇచ్చిన రాజకీయ తీర్పు. రిజర్వేషన్ లేకపోయినా, బీసీలు తమ శక్తిని ప్రజాస్వామ్య మార్గంలో నిరూపించుకున్నారు" అని అన్నారు. ఈ సమావేశంలో బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు ఐలయ్య గౌడ్, బీసీ జేఏసీ కన్వీనర్ రాజునేత, మనోజ్ కుమార్, జోగు నరసింహ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ బిసి సంక్షేమ సంఘం సమావేశంలో పాల్గొన్న జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ తదితరులు

## సైబర్ నేరగాళ్ల లింక్‌లు ఓపెన్ చేయొద్దు
### -ఎస్‌హెచ్ఓ నాగేశ్వర్ రావు

**అత్తాపూర్ పిబ్రవరి14,ప్రభాతవార్త :** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్తాపూర్ సిఐ నాగేశ్వర్ రావు సూచించారు. ఫోన్ కాల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఇంటరాక్షన్‌తోనే సైబర్ కేటుగాళ్లు నేరాలు చేస్తున్నారని తెలిపారు. శనివారం అత్తాపూర్ పరిధిలోని మారుతి నగర్‌లో సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు, గృహిణులు సైబర్ కేటుగాళ్లకు ప్రధానంగా లక్ష్యంగా మారుతున్నారని చెప్పుకొచ్చారు. మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఫోన్లు చేసి భయపెట్టి మోసం చేస్తున్నారని అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తమకు ఎవరిపైనైనా అనుమానం ఉంటే వెంటనే 1930కి డైయాల్ చేసి చెప్పాలన్నారు, సైబర్ నెరగాళ్ల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని ఎవరన్నా అనుమానస్పదంగా కాలనీలలో తిరిగితే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

## అధికారులు ఉద్యోగాలకు రాజీనామా చేసి రాజకీయం చేయండి : బిఆర్ఎస్
### - అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరించారంటున్న నేతలు

**నార్సింగి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** అధికారులు తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి, రాజకీయం చేయాలని బిఆర్ఎస్ నాయకులు మండి పడ్డారు. శనివారం నెక్‌నాంపూర్‌లో బిఆర్ఎస్ నాయకులు అధికారుల తీరుపై సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, నరేందర్‌లు మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో అధికారులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. అలా కాకుండా అధికార పార్టీకి చెందిన నాయకులకు సమాచారం ఇవ్వడం, ఇతర పార్టీల నేతలకు చెప్పకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరిపోయి రాజకీయం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి పనులు మరోమారు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, చట్ట పరిధిలో చర్యలు తీసుకునేంత వరకు తాము పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అందె లక్ష్మణ్‌రావ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్న అనంతగిరి శివాలయంలో వైభవంగా శివరాత్రి ఉత్సవాలు



**అత్తాపూర్ ఫిబ్రవరి14,ప్రభాతవార్త :** చిన్న అనంతగిరి శివాలయంలో ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే మహశివరాత్రి ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి. మహాశివరాత్రి మహోత్సవ సందర్భంగా ఉదయం 4:00 గంటలకు సుప్రభాత సేవ, గణపతి, ఆంజనేయస్వామి, పరమ శివునికి అభిషేకము, ఉమామహేశ్వరి అమ్మ వారికి అభిషేకము, కుంకు మార్చన, గణపతి హోమము, నవగ్రహ విశేష పూజలు ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోండ్ర నర్సింహా అధ్యక్షతన ప్రారంభించారు. గణపతి హోమము తర్వాత పూర్ణాహుతి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు గీతా పారాయణం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, కోశాధికారి స్తోత్ర భాష్యం హరినాథ్, కార్యదర్శులు కొండమీది హరినాథ్, రావుల గండయ్య, , ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, మోండ్ర కొమురయ్య, మ్యాడం మధుసూదన్, ఎస్. జయానంద్ రెడ్డి, హోమం లో పాల్గొన్న దంపతులు ప్రచార కార్యదర్శులు సాబాద స్వప్న విజయ్ కుమార్, సింగాపురం శృతి మహేశ్వర్ రెడ్డి, మోండ్ర అయిలయ్య, పెంటల సుధాకర్ రెడ్డి, మ్యాడం రాము, కే. కిరణ్ చారి, కాకులారం కృష్ణ చెట్టిగారి చిన్న నరేందర్, సులిగే వెంకటేష్, కాడెం నర్సింగ్ రావు, కొంగళ్ల ప్రసాద్, ఎస్. బజరంగ్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సహదేవ రెడ్డి, సులిగే రమేష్, తుల్జగారి లలిత శ్రీరాములు, ఎల్. వెంకటేష్, కైల రవీందర్ రెడ్డి, గోరిగి రాజు, బంగి శ్రీనివాస్, పాత్లావత్ రమేష్ నాయక్, మోండ్ర రాజు, యం. బాలసుబ్రమణ్యం, యూ. శ్రీకాంత్, సోమవారం సురేందర్, తాటి రాజు, పవన్ భారతి చంద్రశేఖర్ దంపతులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కారు అద్దాలు పగలగొట్టిన యువకుడు అరెస్టు

**అత్తాపూర్ ఫిబ్రవరి14,ప్రభాతవార్త :** కారు అద్దాలు పగలగొట్టడంతో పాటు దుకాణానికి నిప్పంటించిన కేసులో ఓ యువకుడిని అత్తపూర్ పోలీసులు అరెస్టు చేశారు. సిఐ నాగేశ్వర్ రావు వివరాల ప్రకారం... అత్తాపూర్ అక్బర్ హిల్స్ లో సయ్యద్ షకీల్ (23) ఏసి దుకాణం నడుపుతున్నాడు. అయితే 12వ తేదీన మహమ్మద్ సల్మాన్ (24) అనే వ్యక్తి అక్రమంగా షాప్ లోపలికి చొరబడి దాడి చేసే ప్రయత్నం చేయగా బాధితుడు వెంటనే అప్రమత్తమై షాప్‌ను మూసివేశాడు. ఈ క్రమంలో బయట నిలిపిన స్నేహితుడు ఎండి పర్వేజ్‌కు చెందిన యూపి 14 ఓ 6546 కార్ అద్దాలు పగలగొట్టడంతోపాటు దుకాణానికి నిప్పంటించి వెళ్లిపోయాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## నేటి నుంచి సృజన జాతీయ నృత్యోత్సవం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 14 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్రాని కి చెందిన ప్రముఖ సామాజిక సాంస్కృతిక సంస్థ సృజన త్రిపుర సమాచార సాంస్కృతిక శాఖ సౌజన్యం తో అగర్తల నగరం లోని ముక్తోదర ఆడిటోరియం లో రెండు రోజుల పాటు నేటి నుంచి జాతీయ నృత్యోత్సవం నిర్వాహిస్తున్నట్లు సంస్థ చైర్ పర్సన్ అంజనా చౌదరి కార్యదర్శి రమ్య తేజ పత్రికా విలేకరులకు తెలిపారు ఈ నృత్య వేడుకల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రీయ జాన పద కళాకారులు చే నృత్య ప్రదర్శన లు ఉంటాయి అని వారు చెప్పేరు ముఖ్య అతిథి గా త్రిపుర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్నాథ్ గౌడ్ పాల్గొని వేడుకలు ప్రారంభించగా ఆ రాష్ట్ర సమాచార సాంస్కృతిక కార్యదర్శి డాక్టర్ ప్రదీప్ కుమార్ చక్రవర్తి ప్రత్యేక అతిథి గా పాల్గొంటారు అని వారు చెప్పారు.

**PUBLIC NOTICE**

NOTICE IS HEREBY GIVEN to the public at large that the original title documents mentioned below, pertaining to the properties owned by my clients, **(1) Patri Hari Babu S/o P. Seshagiri Rao and (2) Smt. Kalyanam Venkata Rajya Lakshmi W/o Patri Hari Babu** have been stolen from their custody on **19-01-2026** from their residence 3-3-112/60P, Street No.1, Lane No.4, Sirimalle Nagar Colony, Hyderguda, Attapur, Hyderabad - 500 048.

**DESCRIPTION OF STOLEN DOCUMENTS AND PROPERTY:**

**1.** Registered Sale Deed bearing Document No. 16144/2021 dated 20-10-2021, registered in the office of the Sub-Registrar, Farooq Nagar, relating to: All that Plot No. 101 admeasuring 183.33 Sq. Yards with approved layout by HMDA vide layout permit No. 000248/LO/Plg/HMDA/2018 by the name of "LEGEND GOLDEN GATE-1" covered by **Survey No. 322/AA, 323/ee, 324/aa, 322/e, 326/aa, 326/e, 323/ou, 323/uu, 323/e, 323/ru, 322/uu, 322/aa, 359/e, 335/a, 336/a, 335/a, 336/e, 321/ee, 340/a/4, 340/a/4, 323/e/1, 321/UU, 335/ee, 359/a, 326, 327, 325, 325/a, 324, 323/d, 324/a, 322/ee, 322/e, 335/a1, 336/a, 321aa/1, 335u, 335e** of Revenue Chattanpally, Lingareddyguda Village and G.P., Farooq Nagar Mandal, R.R.District and bounded by; North: Plot No. 102, South: Plot No. 100, East: Plot No. 110, West: 9.14 mtrs. Internal Road

**2.** Registered Sale Deed bearing Document No. 10170/2017 dated 6-11-2017, registered in the office of the Sub-Registrar Maheshwaram, relating to: All that piece and parcel of the open plot No. 327 admeasuring 425.45 Sq. Yards in **Survey No. 19/P, 35-40, 47-60, 62-72, 75, 76, 77/P, 78, 79, 81/P, 82/P, 83, 84/P, 104, 105/P, 106, 107/P, 108, 109/P, 110/P, 111/P, 112-116, 117/P, 118/P & 121/P** situated at Sardarnagar Village and G.P., Maheshwaram Mandal, R.R. District in the name and style of "HPR GATEWAY" and bounded by: North: Plot No. 328, South: Plot No. 326, East: Plot No. 330, West: 40' Wide Road.

A complaint/FIR has been lodged with the Rajendernagar Police Station vide **F.I.R No. 80/2026 dated 26-01-2026.**

**CAUTION**

General public is hereby cautioned not to enter into any kind of transaction with any person claiming any rights over the property by showing the original of said documents and information may be given at the address mentioned below. Any person(s), bank, financial institution, or authority dealing with the said documents or attempting to purchase, mortgage, lease, or transfer the above-mentioned property based on these stolen documents will be doing so at their own risk, cost, and consequences. My client will not be bound by any such transaction.

Any person who finds the original documents or has any knowledge of their whereabouts is requested to return them or inform to the undersigned at the address below within 15 days from the date of this publication and such person shall be suitably prized.

**Manish Kumar Agarwal**
Advocate
# 3-7-406/13, Sirimallenagar, Hyderguda, Attapur, Hyderabad - 500 048
M. 9848027336

Hyderabad
Dated: 14-02-2026

## వైభవంగా ప్రారంభమైన శివరాత్రి


శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**చౌడపూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మందిపల్ ఓంకారేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతియేటా ఘనంగా నిర్వహించే శివరాత్రి ఉత్సవాలు ఈ సంవత్సరం కూడా వైభవంగా ప్రారంభమయ్యాయని ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆలయంలో గణపతి హోమం, లలితాపారాయణం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి సాయంత్రం ఎదుర్కోలు కార్యక్రమ నిర్వహణ, అనంతరం రాత్రి 1 గంటలకు పార్వతీపరమేశ్వరుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఉత్సవకమిటీ నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్వామివార్ల ఊరేగింపు, నందికోల సేవ కార్యక్రమాలను జరపనున్నారు. మండల ప్రజలు మహాశివరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని రాజశేఖర్ ఆహ్వానించారు.

## సోమలింగేశ్వరస్వామి దర్శనం ఎంతో భాగ్యం


రావిర్యాల శ్రీ సోమలింగేశ్వరస్వామి

**జిల్లెడు చౌదరిగూడ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
జిల్లేడు చౌదరిగూడెం మండల పరిధిలోని రావిర్యాలలో వెలిసిన రాజితాద్రి క్షేత్రం శ్రీసోమలింగేశ్వరస్వామి దేవాలయంలో మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మొదటిరోజు అయిన శనివారం ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అభిషేకము, అర్చన, పూజ కార్యక్రమాలు, సాయంత్రం ఉపవాసదీక్షల విరమణ కొనసాగుతుంది. అదే విధంగా ఊరేగింపు, పల్లకీసేవ, నందికొలసేవతోపాటు రాత్రికి శ్రీసోమలింగేశ్వరస్వామి భజనమండలి ఆధ్వర్యంలో భజన, హరికథాశ్రవణం, జాగరణ కార్యక్రమాలు కొనసాగుతాయి. సోమవారం ఉదయం అభిషేకం, మహానైవేద్యం, దర్శనం అనంతరం అన్నదాన కార్యక్రమం సాయంత్రం నాలుగు గంటలకు శకటోత్సవం(బండ్లు తిరగడం) ఉంటుందని ఆలయ నిర్వాహకులు వివరిస్తున్నారు. సోమలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ముస్తాబై కొలువుదీరాడు. దేవాలయప్రాంగణం శుద్ధిచేసి పూజాకార్యక్రమాలు ప్రారంభించారు. స్వచ్ఛందంగా గ్రామ యువకులు ఆలయనిర్వహణ కార్యక్రమాల్లో నిమగ్నులై ఉన్నారు. మహాశివరాత్రి సందర్భంగా దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

## జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నేడే

**యాచారం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం సత్తయ్య జ్ఞాపకార్థంగా రంగారెడ్డి జిల్లాస్థాయి వాలీబాల్‌టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకం కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా నూకం కృష్ణ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తిలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి, ద్వితీయ విజేతలకు నగదు బహుమతులతోపాటుగా షీల్డ్ బహూకరిస్తామని చెప్పారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైభవంగా పోలేపల్లి ఎల్లమ్మ రథోత్సవం..


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**దుద్యాల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
పోలేపల్లి ఎల్లమ్మతల్లి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ప్రధాన ఘట్టమైన రథోత్సవం కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. ఎల్లమ్మ తల్లికి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం సాయంత్రం 5గంటల సమయంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంతో రేణుక ఎల్లమ్మతల్లి నామస్మరణతో భక్తులు తాడులాగుతూ ప్రధాన ఆలయం చుట్టూ ఐదుప్రదక్షిణలు నిర్వహించారు. బాజాభజంత్రీలు, కరుణించరావమ్మ ఎల్లమ్మతల్లి చప్పుళ్ల మధ్య రథోత్సవం వేడుక కన్నులపండుగగా జరిగింది. ఉదయం నుండి క్యూలైన్లలో నిలబడి భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. జాతరలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు భద్రత ను ఏర్పాటుచేశారు. జాతర సందర్భంగా పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ ముచ్చటి వెంకటేష్, ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్ల చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులకు కరచాలనం చేస్తున్న చైర్మన్ నాగ ఫణీంద్ర

**కీసర, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మన్నె సుబ్రహ్మణ్యం చారిటబుల్‌ట్రస్టు చైర్మన్ నాగఫణీంద్ర అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు విద్యార్థులకు కరచాలనంచేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో జ్యోతిర్ముడి పూజ

**జిల్లెడు చౌదరిగూడ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో శనివారం జ్యోతిరిముడి ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కమ్మరిభూపాలాచారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భగవన్నామాన్ని స్మరించి తరించాలని అన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు వెంకట్‌రాంరెడ్డి, నర్సింలు, యాదవరెడ్డి, అంజయ్య, హరి, అజయ్, పవన్, రాజు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తో పొత్తుకు ప్రయత్నాలు

**-కాంగ్రెస్‌తో కలసి అధికారానికి బిజెపి యత్నం..!**
**-ఆసక్తికరంగా మారిన ఆమనగల్లు రాజకీయం**
**-చక్కర్లు కొడుతున్న ఎక్స్ అఫిషియో ఓటు రాజకీయం**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**
ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అధికారం చేపట్టేందుకు బిఆర్ఎస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ అందుకున్నా, బిజెపి కూడా చైర్మన్ పదవి కోసం పావులు కదుపుతుండడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఆమనగల్లు పురపాలకలో 15 వార్డులు ఉండగా, ఫిబ్రవరి 11న జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ 8, బిజెపి 6, కాంగ్రెస్ 1 స్థానాలలో గెలుపొందాయి. దీంతో మ్యాజిక్ ఫిగర్ ఎనిమిదికి చేరుకున్న బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టేందుకు మార్గం సుగమం అయ్యింది. కౌన్సిలర్లు చేజారిపోకుండా ముందు జాగ్రత్తగా వెంటనే వారిని రహస్య ప్రాంతాలకు తరలించారు. అయితే అధికార పీఠంపై కన్నేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీతో పొత్తుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తుంది. ఆ పార్టీ అధినేత తల్లోజు ఆచారి అందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బిజెపి ఆధ్వర్యంలో ఉన్న ఆరుగురు సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్, ఎక్స్ అఫీషియా ఓట్లతో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ఆచారి విశ్వప్రయత్నాలు సాగిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఎక్స్ అఫీషియా ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక శాసన సభ్యుడు, పార్లమెంట్ సభ్యుడు, మండలి సభ్యుడితో చర్చలు జరిపినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరో పక్క బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల మద్దతు కూడా రాబట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నట్లు కూడా చర్చించుకుంటున్నారు. అయితే మ్యాజిక్ ఫిగర్ చేరుకున్న బిఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం క్షణక్షణం భయంభయంతో ముందుకు సాగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్క సభ్యుడు చేజారినా, వారికి అధికారం దూరమయ్యే పరిస్థితి ఉండడంతో ఎక్స్ అఫీషియా ఓటు కోసం ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఆమనగల్లు ప్రజల తీర్పు రాజకీయంలో హైరానా తీసుకువచ్చిందని అందరి నోటా వినిపిస్తుంది. ఏది ఏమైనా, రాజకీయ ప్రకంపనలతో ఈనెల 16 వరకు ఉత్కంఠ కొనసాగేలా కనిపిస్తుంది.

## విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**-కౌన్సిలర్ హేమ దేవేందర్‌ముదిరాజ్**


విద్యుత్ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ హేమ దేవేందర్ ముదిరాజ్

**కొత్తూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
కొత్తూరు మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు భవానినగర్ కాలనీలో గత కొంతకాలంగా విద్యుత్‌వైర్ల సమస్యతో ఓల్టేజ్ సమస్యలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్కువ ఓల్టేజ్ కారణంగా గృహోపకరణాలు దెబ్బతినడం, రాత్రి సమయంలో చీకటి సమస్యలు తలెత్తడం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఈ విషయాన్ని గమనించిన వార్డు కౌన్సిలర్ వీరమోని హేమ దేవేందర్‌ముదిరాజ్ వెంటనే స్పందించి, స్థానిక ఎమ్మెల్యే ఆదేశానుసారం విద్యుత్‌శాఖ అధికారులతో సమన్వయంచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను, వైర్లను మార్చించడం, లో-ఓల్టేజ్ సమస్యను నివారించే విధంగా సాంకేతిక మార్పులు చేయించడం ద్వారా కాలనీలో విద్యుత్ సరఫరా సక్రమంగా కొనసాగేందుకు ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఏఈ రమేష్‌గౌడ్, లైన్‌మెన్ కోస్గి రాజు, విద్యుత్‌శాఖ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అబద్ధాలకు జనం బుద్ధి చెప్పారు

**-గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రచారంచేస్తున్న అబద్ధాలకు మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అసలైన సమాధానమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి విమర్శించారు. రెండేళ్లుగా పైసా నిధులు తేలేని ఎమ్మెల్యే.. గతంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.200 కోట్ల అభివృద్ధి పనులను తనఖాతాలో వేసుకోవాలని చూడటం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌నేతలు అబద్ధాలు మానుకోవాలని హితవుపలికారు. బిఆర్ఎస్‌కు విజయం అందించిన ఓటర్లకు, కష్టపడిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, కల్యాణం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ డివిజన్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు కంట్లం గౌరీశంకర్ తెలిపారు. ఉదయం 5 గంటలకు గణపతిపూజ, స్వామికి రుద్రాభిషేకం, 10 గంటలకు రుద్రహోమం జరుగుతుందని, శివరాత్రి సందర్భంగా ఆలయంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆలయంలో అర్చకులు శ్యామ్‌కుమార్ మంత్రోచ్చారణాల మధ్య రాత్రి 8గంటలకు భ్రమరాంబికా మల్లికార్జునస్వామి కళ్యాణం, 10 గంటలకు వీరభద్రస్వామిపూజ, రాత్రి 12 గంటలలకు లింగోద్భవకాల అభిషేకం జరుగుతుందని చెప్పారు. ఆలయంలో శివలింగానికి కొమిరిశెట్టి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచలోహతొడుగును చేయించి స్వామికి సమర్పించారని తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు అగ్నిగుండాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

## డ్వాక్రా భవన నిర్మాణానికి భూమిపూజ

**షాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
ప్రజలకు అనుగుణంగా గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని కొమరబండ సర్పంచ్ కుక్కల పద్మమ్మగోపాల్ అన్నారు. మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో ఎస్ఆర్జీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్వాక్రా మహిళల కోసం భవనానికి శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నారమోని శేఖర్, శంకర్, శివకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మతి భ్రమించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే..

**-మాజీ ఎమ్మెల్యేపై మండిపడ్డ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి**


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**వికారాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, వృత్తిపరంగా వైద్యుడు అయినప్పటికీ.. మంచి వైద్యునికి చూపించుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అర్థ సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై వ్యక్తిగతదూషణలు మానుకోవాలని హితవు పలికారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. మాజీ జడ్పిటిసి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇచ్చిన తీర్పును మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తప్పుపట్టడం సరైందికాదన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు కిషన్ నాయక్, చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, నరోత్తంరెడ్డి, మురళి, ముత్తహార్ షరీఫ్, సురేష్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మన్నె సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివి


స్వామివారి సేవలో నాగ ఫణీంద్ర

**కీసర, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
మన్నె సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని కీసరగుట్ట ఆలయచైర్మన్ తటాకం వెంకటేష్‌శర్మ అన్నారు. శనివారం మన్నె సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నాగఫణీంద్ర కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకు న్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పెయింటింగ్ నిర్వహణకు రూ.2లక్షల 50వేలు, జాతర క్రీడోత్సవాల బహుమతుల నగదుపురస్కారానికి రూ.5లక్షలు, రామలింగేశ్వరస్వామి సేవలో భాగంగా భద్రతాకార్యక్రమాలలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ డిపార్ట్‌మెంట్ వారికి 10 క్వింటాళ్ల బియ్యం, మున్నూరుకాపు సంఘం వారు చేపడుతున్న అన్నప్రసాద వితరణకు 3క్వింటాళ్ల బియ్యం ఇవ్వడం జరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థం 10వేల మంచినీటి బాటిళ్ల పంపిణీ చేపడతామని తెలియజేశారు. కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మన్నె సుబ్రహ్మణ్యం ట్రస్టు ద్వారా సుమారు రూ.10లక్షలలతో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాంపల్లిదాయర హేమాద్రి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయచైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహావీర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ధారూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
వికారాబాద్ మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ధారూర్ మండలం గట్టెపల్లి గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వికారాబాద్ పరిసర ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవల ు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో స్థాపించబడిన మహావీర్ హాస్పిటల్, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. గట్టెపల్లి గ్రామానికి చెందిన మరాటి శివకుమార్ ప్రత్యేక పిలుపు మేరకు హాస్పిటల్ యాజమాన్యం సా నుకూలంగా స్పందించి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఈ శిబిరాన్ని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన సర్పంచ్ ఉపసర్పంచ్, హాస్పిటల్ ప్రతినిధులు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని, మందుల ు తీసుకున్నారు.

# కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు

**-బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ సుచరిత**


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ సుచరిత

**కీసర, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా వివిధ ప్రాంతాల నుంచి కీసరగుట్టకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ సుచరిత తెలిపారు. ఈ సందర్భంగా కీసరగుట్టలో శనివారం బస్సులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తులకు రవాణా సౌకర్యం కల్పిస్తూ, నాలుగు డిపోల నుండి 330 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్, ఈసిఐఎల్, వెంకటాపురం, ఉప్పల్, అఫ్జల్‌గంజ్ ప్రాంతాల నుండి బస్సులు అందుబాటులో ఉంటాయని, ఈ ప్రత్యేక బస్సులు గుడి దగ్గరికి వెళ్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు పవిత్ర, అపర్ణ, కళ్యాణి, చోహన్, కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్, కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్, రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్లు చంద్రమౌళి, క్రిష్ణ, ఆనంద్‌రావు, ఎంఎఫ్ వ్యాను ఎస్టిఐలు, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**-పాపిరెడ్డిగూడ సర్పంచి శశిరేఖయాదయ్య**


తాగునీటి మోటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచి శశిరేఖయాదయ్య

**కేశంపేట, జనవరి 14, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంతాలు పట్టణ స్థాయిలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని పాపిరెడ్డిగూడ సర్పంచి శశిరేఖ యాదయ్య అన్నారు. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో శనివారం తాగునీటి బోరు మోటర్‌ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, మాజీ డిప్యూటీసర్పంచి సుందరయ్య, వార్డుసభ్యులు శివానంద్, కుమ్మరి శేఖర్, వర్కాల బిక్షపతి, యాదయ్య, కుర్ర రవి, సత్యం గౌడ్, కుమ్మరి శ్రీను, విక్రమ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ కోసం.. భగీరథ ప్రయత్నం

**-సేవలాల్ మహారాజ్ గుడి పరిసరాల్లో భూగర్భ పరిశోధన**


భూగర్భ జలయంత్రంతో పరిశోధిస్తున్న దృశ్యం

**నందిగామ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
గిరిజనులకు ఇచ్చిన మాట కోసం... ఎంత ఖర్చుకైనా వెనకాడలేదు. ఏడాదిక్రితం రూ.లక్షలు ఖర్చు చేసి రెండు బోరు బావులు తవ్వించారు. బ్యాడ్‌లక్ గంగమ్మ కనికరించలేదు. అయినా ఏమాత్రం వెనకంజ వేయలేదు. సేవాలాల్ మహారాజ్ గుడి పరిసరాల్లో భూగర్భ జలయంత్రంతో పరిశోధనలు చేయించారు. ఈసందర్భంగా సదర్ శ్రీను మాట్లాడుతూ, ఎంత ఖర్చైనా వెనుకాడేదిలేదని, గంగమ్మతల్లి కనికరించే వరకు భగీరథ ప్రయత్నం చేస్తామన్నారు. వెనకబడిన గిరిజనప్రజలకు దాహార్తి తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## నాయకులకు మనోధైర్యం కల్పించిన ఎమ్మెల్సీ

**షాద్‌నగర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికలలో 2వవార్డునుండి చెట్ల నర్సింహులు, 18వవార్డు నుండి ప్రేమలతయుగేందర్, 28వవార్డు జూపల్లి శంకర్‌లు బిఆర్ఎస్ నుండి పోటీచేసి అధికార కాంగ్రెస్ పార్టీ నుండి ఎదురైన అనేక వత్తిడులను ఎదుర్కొని స్వల్పతేడాతో ఓడిననాయకులను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్‌నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ వారి నివాసానికి వెళ్లి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింటూ ప్రతాప్, మాజీ సర్పంచి తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, పోమాల్‌పల్లి సర్పంచి భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి భీష్వ రామక్రిష్ణ, దినేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శంకరుడి త్రిశూలం, కాంగ్రెస్ విష్ణుచక్రం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
రాజకీయాల్లో యువశక్తి ఎదిగితే ఎన్ని ప్రయోజనాలు ఉంటాయో ప్రతి ఒక్కరికి తెలుసు.. అలాంటి యువశక్తి శంకర్ చేతిలో త్రిశూలంలో కదం తొక్కితే.. అర్జునుడి చేతిలో బాణంలా దూసుకుపోతే.. విష్ణుమూర్తి చేతిలో చక్రంలా వేగాన్ని ప్రదర్శిస్తే.. పార్టీకి జవసత్వాలు వస్తాయి.. అలాంటి యువ రక్తం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో వేగంగా పావులు కదుపుతుంది. ఆ యువరక్తం పేరు అందెమోహన్. కరుడుగట్టిన కాంగ్రెస్ వాది కుటుంబంలో నుండి పుట్టిన అందెమోహన్ యువనేతగా పార్టీలో అడుగుపెట్టి చురుకుదనంతో, ఉత్సాహంతో పార్టీకి వెన్నుముకల నిలుస్తు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కూడా అన్నింటా అండగా ఉంటూ అత్యంత సన్నిహితుడుగా ఎదుగుతున్నాడు. ఇంతింతై ఎదుగుతున్న ఈ యువనేమున్సిపల్ ఎన్నికల్లో భారీ ధమకాతో గెలిచాడు. మున్సిపల్ చైర్మన్ రేస్‌లో ఉన్న అందెమోహన్ గెలిచాక స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాదాలకు నమస్కారం చేసి ఆశీస్సులు పొందాడు. ఇప్పుడు శంకర్ ఆశీస్సులు అందెమోహన్ కు ఎంత మేరకు పనిచేస్తాయి పార్టీని పలోపేతం చేసే దిశగా అందెమోహన్‌కు చైర్మన్ పీఠం దక్కుతుందా లేదా అన్నది పార్టీ వర్గాలకే తెలియాలి.

## మృతుడి కుటుంబానికి చేయూత

**-లక్ష రూపాయల ఆర్థిక సహాయం..**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**
అలియాబాద్ గ్రామానికిచెందిన సిరిశెట్టి రాజేశ్ (అయ్యప్పమాల ధారస్వామిభక్తుడు) ఇటీవల కేరళలోని శబరిమలైవెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందటంతో అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ అధ్యక్షులు అయ్యప్పదాస్ సూచనల మేరకు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా లక్ష రూపాయల డిపాజిట్స్ బాండ్స్‌ను ఆ ధర్మ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు టివి.పుల్లంరాజు అందజేశారు. శనివారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని స్వర్గీయ సిరిశెట్టి రాజేశ్ చిత్రపటానికి ఛీఫ్ కోఆర్డినేటర్ రాచర్ల రమేశ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తరువాత ఆయనతో పాటు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు టివి పుల్లంరాజు, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చోడ శంకరాచార్యులు, జాతీయ పిఆర్ఓ రాయబారపు రవిరాజు, జోనల్ సెక్రటరీ జాపా మల్లేశ్, కనికట్టి సాగర్‌గౌడ్, పుష్పాలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మధు, కార్యదర్శి బుచ్చిరెడ్డి, స్థానిక సీనియర్ గురుస్వామి సత్యంగురుస్వామి, స్థానిక ఎబిఎపి సభ్యులు పాల్గొన్నారు.

## కుర్చీలు బహూకరించిన వార్డుసభ్యులు

**యాచారం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో గల జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోషియేషన్ కు 8వ వార్డు సభ్యులు కొండాపురం సుష్మ శ్రీశైలం శనివారం మౌలిక వసతులైన కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ మాట్లాడుతూ.. సేవా భావంతో వార్డుసభ్యులు అడగగానే కుర్చీలు సమకూర్చడం అభినందనీయమన్నారు. జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్‌కు ఎంతో వైభవం ఉందని యూత్‌ను మరింత అభివృద్ధిపరుస్తూ జిల్లాలోని మంచిపేరు తీసుకురావడానికి కృషిచేస్తానన్నారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని క్రీడా ఉత్సవాలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు.

## నెంబర్ వన్.. వార్డ్ మెంబర్.!

**నందిగామ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**
నందిగామ గ్రామపంచాయతీ మొదటి వార్డుసభ్యులు అగ్గిప్రసాద్ ప్రగతిపథంలో ముందు ఉన్నారు. షాద్నగర్ ఎమ్మెల్యే అభివృద్ధి పథకాల స్ఫూర్తి ప్రదాత వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో సర్పంచ్ కొమ్ము కృష్ణ నేతృత్వంలో అంగన్వాడి కేంద్రం, మహిళా సమైక్య భవనం నిర్మాణానికి భూమిపూజ చేసి నిర్మాణ పనులను వేగవంతం చేశారు. అంతేకాకుండా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వీధుల్లో ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి ప్రజలకు జిగేలు మనిపించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, ఏఎంసీడైరెక్టర్ సి.నర్సింలు, వార్డుసభ్యులు తదితరులున్నారు.